


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -183-

**(20 మే 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**పై జన్మను గురించి** క్రిందటి వ్యాసంలో పత్రికా విలేఖరి ఇంటర్వ్యూ చేసి 'ఒకవేళ మగవాడుగా జన్మిస్తే ఎలాటి లక్షణాలు గల వ్యక్తిగా జన్మించాలని వుంది' అని ప్రశ్నించాడు...

"మగవాడుగా జన్మించడం తప్పని పక్షంలో, చదువు వచ్చినా రాకపోయినా బలం, బడాయి కోరుతనం, కొంచెం జబర్దస్తీతనం వున్నవాణ్ణిగా జన్మించాలని వుంది. చదువులు, హోదాలు, పదవులు వీటికి ఆ కాలం నాటికి బొత్తుగా పలుకుబడి వుండేలాగా లేదు. డబాయించుకు బ్రతకవలసిన అవసరం ఎంతైనా ఏర్పడుతుంది. అలాటివాళ్ళ బ్రతుక్కి ఢోకా వుండదు.." అన్నాడు ఆ పెద్దమనిషి.

"అదేమిటి విద్య అక్కరలేదంటారు? ప్రపంచం నాగరికతలో ఇంకా ముందుకు పోతుంది కదా! శాస్త్ర పరిచయం ఎంతో అవసరం అవుతుంది గదా! మేధస్సు అక్కరలేదంటే ఎలా?" అన్నాడు విలేఖరి.

మేధస్సుతో బండి నడపడం చాలా కష్టమండీ. నా దగ్గర బోలెడు తెలివితేటలున్నాయంటే ఎవరూ నిలబడి నమస్కరించడంలేదు. కర్ర భుజాన పెట్టి, గుడ్లు ఎర్రచేసుకుని చూస్తే గజగజలాడిపోతోంది ప్రపంచం. కొట్టక్కర్లా, తిట్టక్కర్లా, దిటవుగా నిలబడితే చాలు. అంతేగాని దిక్కులు చూస్తూ నిలబడే కాలం పోయిందండీ అన్నారాయన ఎంతో విచారంగా.

"అయితే మీరు భుజ బలానికే ఎక్కువ ప్రాధాన్యమిస్తారన్నమాట. బుద్ధి బలానికి రెండోస్థానమేనన్నమాట. అయితే మీరో వస్తాదుగానో, వజ్రకాయులుగానో జన్మించాలని వున్నదన్నమాట" అని ప్రశ్న.

"అవునండీ ఏదో విధంగా కొంతపేరు సంపాదించుకోవాలి. పదిమందికీ పరిచయం కావాలి. ఫలానావాడు ఉద్దండుడురోయ్ అనిపించుకోవాలి. అప్పుడు మనం ఎలా చెపితే అలా నడుస్తుంది బండి. మన చూపే లైన్ క్లియర్‌గా మారిపోతుంది.

"ఇంకో తమాషా ఏమిటంటే అలాటి అఘాయిత్యపు పేరు సంపాదించుకున్న తర్వాత, అవసరమైన తెలివితేటలన్నీ అప్పుడే పుట్టుకొస్తాయి. కేవలం చదువుకున్నవాళ్ళకి అనవసరపు తెలివి తేటలు కూడా కొన్ని పుట్టుకు రావడమంటూ వుంటుంది.

పైన చెప్పిన తరగతి వాళ్ళకు అలాకాదు. అవసరమైన తెలివితేటలు వాటంతటవే పుట్టుకొస్తాయి. వాటికి కోచింగ్ అక్కరలేదు. టీచింగ్ అక్కరలేదు.

"పైగా ఇంకో గమ్మత్తు వుంది ఇలాటి తెలివితేటల్లో. అంతకు ముందు ఏమీ తెలియనివాడు హఠాత్తుగా 'అ ఆ'లు అప్పగించినా అందరూ ఆశ్చర్యంగా వింటారు. నాలుగు పెద్ద ముక్కలు వాడితే చాలు "సాహిత్యపు లోతులు తరిచారు" అని పొగుడుతారు. చదువుకోకుండానే ఇంత విజ్ఞానం మూటగట్టారు. చదువుకుంటే విజ్ఞానం పాతరలే వేసేవారనుకుంటారు" అని ఆయనగారి వ్యాఖ్యానం.

"మీరు చెప్పింది అక్షరాలా నిజం. మరి మీరు ఏ రాజకీయ పార్టీలోనన్నా చేరతారా? విడిగానే వుంటారా?" అని ప్రశ్న.

"రాజకీయాలు ఈ రోజుల్లోనే ఇలా వుంటే ఆ రోజుల సంగతి చెప్పాలా? ఏ పార్టీ ఎన్నిరోజులుంటుందో? ఒక పక్షంలో వెన్నెలా, రెండో పక్షంలో చీకటిలాగా.. రాజకీయ పక్షాలు అటూ, ఇటూ అవుతూ వుండవచ్చు.

కనుక మనం ఏ పార్టీలోనూ చేరకూడదు. అన్ని పార్టీలూ మన దగ్గరికే రావాలి. అప్పుడు నిలుస్తుంది మన ఠీవి. అంతేగాని ఒక పక్షాన్ని నమ్ముకుంటే ఎలా? ఇవ్వాళ ఊట బావి – రేపు పాడుబడిన బావి.. ఏమంటారు?" అన్నారాయన మందహాసంతో.

"మీరు బాగా అవగాహన చేసుకున్నారు రాజకీయ రంగాన్ని. అందులో మీరు పదవులకు ఆశించని జీవితం కావాలనుకోవడం చాలా గర్వించతగిన విషయం. అయితే మరొక్క చిన్న ప్రశ్న. మీరు స్త్రీలుగా పుట్టాలనుకుంటూ, తప్పని సరిగా పురుషులుగా పుడుతున్నారు గనుక అలాటి సందర్భంలో స్త్రీలను మీరెలా గౌరవించదలిచారు ఆ జన్మలో?" అని విలేఖరి ప్రశ్నించాడు.

"ఈ ప్రశ్న మీరు వెయ్యడం అనవసరమనుకుంటాను. ఆ జన్మనే ఆశించేవాణ్ణి... వాళ్ళను గౌరవించడంలో వెనకపడతానా? ఎన్ని విధాలుగానో గౌరవిస్తాను. వీలైతే పూజిస్తాను. చేతనయితే వారిమీద గ్రంథాలు వ్రాస్తాను..కలిసి వస్తే ఒక తారను వివాహమాడి 'స్త్రీ మూర్తి.. ఉజ్జ్వల కీర్తి' లాటి పేర్లతో కొన్ని చిత్రాలు కూడా తీస్తాను. ఆ జన్మంతా ఇంచుమించుగా వారికోసమే ధారపోస్తాను.." అని ఆయనగారెంతో గంభీరంగా చెప్పారు.

"మీరు చెప్పింది చాలా అద్భుతంగా వుంది. మీకుగల మహిళాభిమానానికి ఆ కాలంలో వారెంతో మెచ్చుకుంటున్నారు. ఆనాటి పత్రికలు మిమ్మల్ని గురించి ఎన్నో వ్యాసాలు ప్రచురిస్తాయి. అనేక మహిళా సమాజాలు మిమ్మల్ని సన్మానిస్తాయి" అన్నాడు పత్రికా విలేఖరి.

ఆ మాటకు ఆ పెద్దమనిషి చాలాసేపు పకపకా నవ్వారు. అదంతా ఆయన పడుతున్న ఆనందం కాబోలుననుకున్నాడు పత్రికా విలేఖరి. ఆ ఆనందంలో తను కూడా కొంత పంచుకుందామని ఆయన కూడా నవ్వడం ప్రారంభించాడు.

కొంచెం సేపటికి ఆ పెద్దమనిషి నవ్వు ఆపి "అదికాదు విలేఖరిగారూ ఆ రోజుల్లో నన్ను మెచ్చుకుంటారనీ, సన్మానాలు చేస్తారనీ సంబరాలు పడతారేమిటి మీరు? ఆ రోజుల్లో నేనొక లెక్కా? జనాభాలో మూడు వంతులు నాలాటివాళ్ళే వుంటారు. అందరూ మహిళాభిమానులే. అయితే ఎందరికని సన్మానాలు చేస్తారు?

అలాటి గౌరవం పొందాలంటే ఈ జన్మలోనే అలాటి కార్యక్రమం ప్రారంభించాలి. మహిళాభ్యుదయానికి ఇంకా కొంత తెరవు వుంది ఈ కాలంలో. మీరు తగిన ప్రచారం చేస్తానంటే ఇప్పుడే మొదలు పెదతాను ఆ కార్యక్రమం" అన్నాడు ఆ పెద్ద మనిషి.

"అందుకు మీరేమీ సందేహించక్కరలేదు... మీరే కార్యక్రమం నిర్వహించినా, ఎక్కడ ఉపన్యాసమిచ్చినా, చివరకు ఒక స్టేట్‌మెంటు ఇచ్చినా మేము తప్పకుండా డబుల్, ట్రిబుల్ కాలం హెడ్డింగులతో ప్రచురిస్తాం..."

"అసలు మీరు ఇంటర్వ్యూలు పేరుతో వెయ్యవద్దన్నారు గాని లేకపోతే వీటితోనే మీకు బోలెడు పేరు వచ్చేది. మహిళాలోకం మిమ్మల్ని ఎంతగానో కొనియాడేది.. ఏమంటారు?" అన్నాడు పత్రికా విలేఖరి.

"వద్దులెండి.. పేరుతో వద్దులెండి.. మనస్సుకు ఎంత చెప్పుకున్నా మళ్ళీ జన్మలో మగువగా పుట్టాలని వుందని ప్రకటించడానికి ఇష్టపడటం లేదు. ఆత్మ ఒకటి వుందిగా. దాన్నికూడా అడిగి చూశాను" అన్నాడాయన.

"అవునవును ఇటీవల ఆత్మకు ఎక్కువ ప్రాధాన్యం వచ్చిందిగా అదేమంటుంది?" అన్నాడు పత్రికా విలేఖరి.

"పుడితే పుట్టాలిగాని.. ముందుగా చెప్పుకోవడం దేనికి? అదంతమంచిపని కాదు. పుట్టి నీ ఠీవి చూపించు" అన్నది ఆత్మ అన్నాడాయన.

"సరే.. అలా అయితే మారుపేరుతోనే వేద్దాంలెండి.. వస్తానుమరి" అని పత్రికా విలేఖరి చిరునవ్వులతో నిష్క్రమించాడు.

Post your comments